# జేగురుమల్లె

మా క్లాసులో ముసురుకునే ఆడపిల్లలందరూ, పెళ్ళికూతుళ్ళే! – ఒంటి జంధ్యప్పోచవాణ్ణి నేనొక్కణ్ణే – తతిమ్మా ఆసాములందరూ... దైవం రక్షిస్తే, బిడ్డల తండ్రులే...

ఆ ముసిముసి నవ్వులన్నీ నావంక, కోరగా – దోరగా చూస్తూంటాయని గిట్టనివాళ్ళు నాతో లక్షసార్లు చాడీలు చెప్పారు. కాని, నేనేం ఎరుగున్నాను? – ఎన్నడన్నా, గుమ్మందగ్గిర బల్లల వంక తలఎత్తి చూసిన పుణ్యానపోయినానా?

ఆడపిల్లలు, ఇదిగో, ఈ పక్కనుంచి ఎక్కాలి: మొగపిల్లకాయలు అదిగో అపక్కనుంచి ఎక్కాలి – ఇది మాబళ్ళో, ఆడపిల్లలు పుట్టుక ముందునుంచీకూడా అనవయితేనట – కాని, మా బళ్ళో, పిడుక్కో మంత్రం, బియ్యానికో మంత్రం:– మొగవాడు ఆ వరుసను దిగితే అదమాయించి జుల్మానా వేస్తాడు ఆచార్యులుగారు: ఆడపిల్లలు... మావైపునుంచి దూసుకు వస్తూంటే – ఆదరించి... అందిపుచ్చుకు దింపుతాడు.

ఇదొక్కటే కాదు... ఎంచబోతే మంచమెల్లా కంతలే – ఇలాటివి లక్షలున్నాయి... ఇంతకూ, ఆడపిల్లకు బళ్ళో చెల్లే ముద్దూ, మురిపెం – అత్తింట ఉంటుందా? – పుట్టింట మంచిదా? అందుకనే, కాలేజీలో చదువుకున్నన్నాళ్ళూ ఆడపిల్లయిపోవడం మేలు – అని ఊరికే అన్నారా పెద్దలు – ఆ తరువాత కావాలంటే మళ్ళీ ఒళ్ళు మార్చుకోవచ్చు.

చూడగా చూడగా నాకు అలాగే అనిపించింది.

ఇంకో బాధకూడా ఉంది సుమండీ!

వీళ్ళున్నారే యీ ఆడపిల్లలు... దోవకు అడ్డంగా నిలుచుని, కదలరు: పోనీ మనకెందుకు అంత శరం అని, తప్పించుకు పోదామా అంటే. వాళ్ళనవ్వు తరుముకు వస్తుంది... ఏం చెయ్యను?

'ఏం చెయ్యను భాయీ, ఇలా ఉంది నా స్థితి' అని మనసువిడిచి అయినవాళ్ళందరినీ అడిగాను: వాళ్ళందరూ వికవికలూ పకపకలూను! – ఎవడిమట్టుకు వాడు నారొట్టెలన్నీ విరిగి నేతిలో పడ్డాయనుకునే వాళ్ళే. లేదురా బాబూ, ఇది ప్రాణాంతకంగా ఉందంటే, ఒక్కరూ నమ్మడే. పైపెచ్చు నామొగానే ఉద్దండంగా పిడుగుమంత్రం ఉరమడం ప్రారంభించారు!

కాని, వీళ్ళే మెరుగు... మరీ, ఎలా పొక్కిపోయిందో, ఏమో కాని... నేను అల్లంత దూరాన కనబడటం భయం, ఆడకూతుళ్ళందరూ ఆకాశానికి మోరలు సాచి 'అర్జునః ఫల్గుణః పార్థః' – అని లంకించుకునే వాళ్ళు... నాకు మనసులో గతుక్కుమని కళ్ళజోడు చెమ్మగిలేది.

నేనూ మనిషినే

నేనూ అందరిలాంటి మనిషినే

ఈ రెండు ముక్కలూ, వాళ్ళు నడ్డివాల్చుకునే గది గుమ్మంలోకి విసిరాను. అగాను. ఒక్క నిమిషం నిశ్శబ్దం. అన్ని గొంతులూ ఈలగా గింగురు లెత్తినాయి.

'నా జోలికివస్తే... జాగ్రత్త!' – బాగా రెచ్చిపోయి, హుంకరిద్దామనే దడలో, మాట తడిపేశాను.

'నా జోలికి రాకపోతే – జాగ్రత్త'... నాకు వెన్నిచ్చి, సాటివాళ్ళను వెక్కిరించింది... వాళ్ళల్లో ఓ ప్రమీల... నాకు ఉసూరు మనేందుకైనా, ఓపిక లేకపోయింది.

ఆవాళ సాయంకాలము, గేటుదగ్గిర కాపుకాచి నిలవేసింది.

'ఇంటికేనా? –' అంది. నేను మొగం అటుతిప్పుకున్నాను.

'పద, కలిసిపోదాం –'

నేను ధూకుడుగా నాలుగు అడుగులు ముందుపడ్డానన్న మాటేకాని, ఒక్క చెంగులోవచ్చి కల్సుకుంది.

'ఒంటరిబుద్ధి అలవాటైందేం? –

అయ్యవంకదా, అమ్మవంకదా, ఇది...'

అంటూ మోచేత్తో, ఇలా, మోటించింది. నేను, చురచుర లాడుతున్నా ననుకుంటూ –

'మానాన్న బ్రహ్మచారి' అన్నాను.

నవ్వింది.

'ఓం... తుమ్మితే ఊడిపడ్డ బాపతన్నమాట!'

'మానాన్న కనలేదు... పెంచుకున్నాడు...' అని, ఖంగారులో నజ్జుగా అన్నాను...

ఆడపిల్లయిన తరువాత, బొత్తిగా భయమూ భక్తీ ఉండక్కర్లా?... ఎంతమాట పడితే, అంతమాట అనడమేనా?...

ఈమాటే వాళ్ళనాన్నతో అన్నాను. సరిగ్గా వినిపించుకో లేదేమో అని మళ్లీ గట్టిగా అన్నాను.

ఆ దుబ్బుమీసాలు అంటాయి కదా? –

ఏమో నాయనా... భయమూ భక్తి అంటే వేసుకునే ఫేస్ పౌడరా... కట్టుకునే లంగా? – ఒంటెని అంటిపెట్టుకునే ఉండేందుకు... వాడిక లేదాయెను, ఎక్కడో పడేసి మరచిపోతారు, అందులో యీకాలప్పిల్లలకు అజాగ్రత్త జాస్తీ –

'అసలు ఇంతకూ, ఇంకోటికూడా ఉంది... అరునెల్లు సావాసం చేస్తే వారు వీరౌతారన్నట్లు యీ కలగలపు చదువులొచ్చి పడ్డాక అంతా తగని తికమకగా ఉందనుకో! ఆ దాకా ఎందుకూ ఒక్కొక్కప్పుడు, దీన్ని... అమ్మాయి అని పిలవాలో అబ్బాయీ అని పిలవాలో నాకే సందేహంగా ఉంటుంది – అయినా బాగుండిపోను... నేడో రేపో చేతికి అక్కరకు వచ్చే వాడు...'

'ఇలాటి కోడలు వచ్చేది... ఇంట దీపంపెట్టడానికి!' – అని వాళ్ళనాన్నమాట అందుకుని, ప్రమీల సిగ్గూ బిడియం లేకుండా... వేలెట్టి కళ్ళల్లో పొడిచినట్టు నావంక చూపిస్తూ –

నేను పారిపోయి వచ్చేశాను

సిగ్గువిడిచి చెప్తున్నాను

తెల్లవారి కాలేజికి వెళ్ళీ వెళ్ళడంతోటే - వసార్లో పచారుచేస్తూ, ఓ రౌతు ఎదురై, మొగంలోకి మొగంపెట్టి 'ఏం వదినా!' అంటూ, చెంపను చిటుక్కు, మనిపించింది. కళ్లు దిమ్మెత్తిపోయి, ఉత్తరీయం అంచు, చీరెచెంగు అనిపించింది...

'పిల్ల సిగ్గు పడుతూంది, తప్పుకోండే, పాపం -'

ఎందుకే సిగ్గు - పరాయిదా, మన ప్రమీల పెళ్ళామేగా! -

'ఎన్నో వదినే! - నిన్ననో, మొన్ననో ఇంకోత్తె వెలిసిందల్లే ఉందే...'

ఇల్లా అన్నారు. వీళ్ళను ఏంచేసినా పాపం ఉందా? -

జ్వరంవచ్చి కాలేజీ మానేద్దామా అంటే - అది ఎన్నాళ్ళు - పోనీ, సాపుగానే మానేస్తే... తిరుగుటపాలో నాన్న గాజుల జతలు పంపిస్తాడు...

నాన్న ఇవాళ టపాలో ఉత్తరం వ్రాశాడు. శుభలేఖ వెనుక పక్కను... ప్చ్! ప్రమీలకు నన్నిచ్చి పెళ్ళిచేస్తున్నారు. ... మంచి మూర్తాన...

సీత అనసూయ మొదలైన పుణ్యస్త్రీల బాధలు తలచుకుంటూ, సొమ్మసిలినట్లు కన్ను మూశాను. ఏమిటో నిద్రపోతున్నంత సేపూ అదోమాదిరి ధైర్యంగానే ఉంది... మెలకువ వచ్చిన తరువాత మళ్ళీ ఒమారు చదువుదును గదా... అచ్చారా, నేను పెళ్ళికొడుకుననే పెద్దలు నిర్ణయించారు!

అయినా, నాకు యింకా బెదురు వదలడం లేదు... గుండెల్లో రొమ్ము కుమ్ముతూంది...

*[ఆనందవాణి - దీపావళి]*

★ ★ ★